# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







## ఆసరైనోళ్ల దిక్కు ఉంటెనే మంచిగుంటది

గూడూరు: ధరణితోనే మాకు ఇబ్బందులు తొలగినయ్.. మా భూములకు పట్టాలిచ్చింఁడ్రు. పోడు భూములు చేసుకుంటున్న మా గురించి ఇని రోజులు ఏ పాలకులు, ప్రభుత్వాలు కూడా ఆలోచించలేదు. మా గిరిజనులను ఓటు బ్యాంకుగానే చూసినారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా తండాలో మారాజ్యంతో పాటు మా భూములు మాకు లభించినయి. నేడు మా రాజ్యం మేము ఏలుకుంటూ మా భూమికి సైతం మేం స్వంత దారులం అయినం.. మళ్లీ కేసీఆర్ సార్‌కే మా గిరిజనుల బలం, బలగం.. గతంలో మా తాతా, తండ్రి అందరూ పట్టాలకోసం ఆఫీసుల చుట్టూ ఏండ్ల తరబడి తిరిగినా ప్రయోజనం లభించలేదు. నేడు ఒక్క పైసా ఖర్చులేకుండా మా చేతికి పట్టాలు వచ్చినయి. పోడు భూములకు ఓనర్లమైనం రాసుల కొద్దీ పంటలు పండించుకుంటూ హాయిగా బతుకుతున్నం. ధరణి పోతే మా భూములు ఎవరి చేతికి పోతయో తెల్వదు. మమ్ములను ఆదుకునేటోళ్లకే మా మద్దతు.

**- ధరావత్ దూద్యా, రైతు, భద్రుతండా**







# ఆ పాలనలో కాళరాత్రులే

### నాటి చీకటి రోజులు మళ్లీ రావద్దు

- కరెంటు లేని ఎవుసం చేయలేం
- రైతులను ఆగంజెయ్యాలని చూస్తున్నరు
- భూములను కాజేయాలని పన్నాగం పన్నుతున్నరు
- 'హస్తం' పార్టీపై రైతులు, ప్రజల మండిపాటు
- బీఆర్ఎస్ పాలనే బాగుందంటూ కితాబు
- కంటికిరెప్పలా కాపాడుకునే కేసీఆర్‌కే మద్దతు అంటూ స్పష్టం

## కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే

*ఏనాడూ ప్రజల బాగోగుల గురించి ఆలోచించని కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడేనని, ఎట్టి పరిస్థితుల్లోనూ తాము పాత రోజులను కోరుకోవడం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఇలానే కొనసాగాలని తాము కోరుకుంటున్నామని, తమ మంచిచెడ్డల గురించి ఆలోచించే గులాబీ పార్టీ వెంటే ఉంటామని రైతులు, ప్రజలు స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డ రోజులు ఇంకా గుర్తున్నాయని, కరెంటు లేక, నీళ్లు లేక ఎవుసం సాగక ఏడ్వామని, ఇప్పుడు వచ్చి అదిచేస్తాం.. ఇదిచేస్తామని అసలు ఎవుసం గురించి తెల్వనోళ్లు మాట్లాడుతున్నారని, ఎవుసానికి మూడు గంటల కరెంటు ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. ధరణిని తీసేస్తామంటే ఊరుకునేది లేదని, మళ్లీ భూముల పంచాయితీలు తేవద్దని తెగేసి చెబుతున్నారు. ఎన్నో ఏండ్లు పరిష్కారానికి నోచని సమస్యలు కూడా ధరణితో తీరాయని, ఇప్పుడిప్పుడూ భూముల కొట్లాటలు తగ్గుతున్నాయని, మళ్లీ దళారుల రాజ్యం రావద్దని అంటున్నారు. రైతులకు ఏంకావాల్నో తెలిసిన కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆగంజేసే కాంగ్రెస్ వద్దని ముక్తకంఠంతో చెబుతున్నారు.*

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 25**



## ధరణితోనే రైతుకు ధైర్యం

కురవి: ధరణితోనే రైతుకు ధైర్యం. తన భూమి తన వేలిముద్రతోనే మార్పు సాధ్యమవుతుందని తెలియడంతో ధర్జాగా ఉన్నాడు. గతంలో రైతు భూమిని ఇష్టం వచ్చినన్ని సార్లు అధికారులు డబ్బులకు ఆశపడి పేర్లు మార్చేవారు. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తేవడంతో భూమి పేరు మారాలంటే రైతుకు తెలిసిన తరువాత లేదా, ఆ రైతు చనిపోతే వారి కుటుంబానికి తప్ప మరో తీరుగా మారే అవకాశం లేదు. గతంలో భూమిని అమ్మాలన్న, కొనాలన్నా పేరు మారేసరికి నెలలకు నెలల సమయం పట్టేది. కానీ ఇప్పుడు ఒక్కరోజుతో పేరు మార్పిడి జరుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ దళారుల వ్యవస్థను పెంచి పోషించేందుకు యోచిస్తున్నది. రైతులు జాగ్రత్తగా ఉండాలి. రైతులు ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేసి తమకు అండగా నిలబడే ప్రభుత్వానికి బాసటగా నిలవాలి.

**- గుగులోత్ రవి, రైతు, మేగ్యాతండా**



## కాంగ్రెసోళ్ల 'భూమేత' వస్తే ఆగమైతం..

డోర్నకల్: కాంగ్రెస్ పార్టీ భూమాత పోర్టల్ తీసుకొస్తే రైతుకు మస్తు కష్టం అయితది. దాని వల్ల మళ్ల పట్వారీ వ్యవస్థ వస్తది. దళారులు బాగుపడుతరు. భూములు కబ్జాకు అయితయ్. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో భూములు ఎక్కడం వల్ల రైతుల ఇబ్బందులు తప్పినయ్. ఇయ్యాల భూముల మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ ఒక్క రోజులనే అయితానయ్. కాంగ్రెస్ పార్టీ ధరణి ఎత్తేస్తే రైతులు ఆగమైతరు? ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగకుండా కేసీఆర్ సార్ మంచి పనిచేసిండు. ధరణి గిట్లనే కొనసాగాలె.. సీఎం కేసీఆర్ మూడోసారీ ముఖ్యమంత్రి కావాలె. మా మద్దతు బీఆర్ఎస్ పార్టీకే. ధరణిని తీసేస్తమన్న కాంగ్రెసోళ్లను ఊరి పొలిమేరకు కూడా రానియద్దు. ధరణిని ప్రవేశపెట్టి రైతుల భూములకు భద్రత కల్పించిన సీఎం కేసీఆర్‌ను మళ్ల గెలిపించుకుంటం.

**- తేజావత్ భాస్కర్, రైతు, బొడ్రాయి తండా**

## కాంగ్రెస్ వస్తే బలం ఉన్నోడిదే రాజ్యమైతది..



చిన్నగూడూరు: ధరణి వచ్చి రైతు కుటుంబాలకు, భూములకు రక్షణ తెచ్చింది. నాడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భూ రిజిస్ట్రేషన్ కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేది. సీఎం కేసీఆర్ వచ్చినంక స్లాట్‌బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ ఫీజు కట్టి రూపాయి లంచం లేకుంటనే భూమిపై యాజమాన్య హక్కులు పొందవచ్చు. కేసీఆర్ గొప్ప ఆలోచనతో రైతులకు మేలు జరుగుతాంది. ధరణి తీసేస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నరు. పల్లెల్లో బలం ఉన్నోడిదే రాజ్యం అవుతుంది. పేదల భూములను ఉన్నోడు లాకుంటాడు. పాత పద్ధతిలో దళారులు బాగుపడతారు. ధరణి ఉంటేనే సామాన్యుడికి సైతం లాభం కలిగి, రైతు బంధు వస్తుంది. రైతులు ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నరు. కాంగ్రెసోళ్ల మాటలు వింటే రైతులు ఆగమైతరు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలు బాగుపడుతరు. కేసీఆర్ సార్‌కే మా మద్దతు.

**- మూరగుండ్ల రాములు, రైతు, చిన్నగూడూరు**

## రైతులను సతాయించెటోళ్లు మాకెందుకు..?

దంతాలపల్లి: ధరణిలో రైతులకు సంబంధించిన భూముల వివరాలు ఎప్పుడైనా చూసుకోనే అవకాశం ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో భూముల రికార్డులు సరిగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పట్టా భూములు ఎవరి పేరు మీద మారుతాయో తెలియని పరిస్థితి ఉండేది. భూముల రికార్డులు చూసుకునేందుకు పహాణీల కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేంది. రేపు, మాపంటూ వాళ్లు మస్తుగా సతాయించెటోళ్లు. ధరణి రావడంతో ఆ పరిస్థితి మారింది. ఫోన్‌లో రైతుల భూములకు సంబంధించిన వివరాలు చూసుకునే అవకాశం ఏర్పడింది. ఇప్పుడు రైతులు భూములు అమ్మాలన్నా, కొనాలన్నా ఎలాంటి ఇబ్బందులులేవు. మీ సేవాలో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత తహసీల్దార్ కార్యాలయాల్లో 20 నిమిషాల్లో ఈజీగా పని అయిపోతున్నది. గతంలోనైతే పనులు కావాల్నంటే ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. గిప్పుడు మళ్ల ఆ రోజులే కాంగ్రెస్ తీసుకస్తనంటాంది. గట్ల జేస్తే మాలాంటి రైతులు మళ్ల ఇబ్బందులు పడుతరు. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి. కేసీఆర్ సార్ వస్తెనే అందరికీ మంచిది. కారు గుర్తుకే మేమందరం ఓటు వేస్తం.

**- నెమ్మది వెంకన్న, రైతు, దంతాలపల్లి**



## కాంగ్రెస్‌తో రోజూ జాగారమే

గార్ల: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఇక పాతరోజులు తప్పవు. రోజూ జాగారమే చేయాల్సి వస్తది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంట్ చాలు, 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని మాట్లాడుతున్నడు. 10 హెచ్‌పీ మోటర్లకు సపోర్ట్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్ వాళ్ల తాత కొనిస్తాడా? రైతులకు లక్షల రూపాయలు పెట్టి కొనేంత స్థోమత ఉందా? సీఎం కేసీఆర్ రైతులకు ఉచితంగా 24 గంటలు కరెంట్ ఇస్తుంటే, రాజకీయ లబ్ధి కోసం మాయ మాటలు చెప్పే రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలె. కేసీఆర్ ప్రభుత్వంలోనే అందరం సంతోషంగా ఉన్నం. తప్పకుంట బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలె.

**- దాసరి శ్యామ్, రైతు, గార్ల**





## కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఎవుసం భారమే..

బయ్యారం : కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతులు ఎవుసం చేయడం ఇక కష్టం అవుతుంది. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరంట్ కోసం పడ్డ బాధలు ఇంకా యాదికున్నయ్. కరెంటు ఎప్పుడొస్తుందో తెలియక.. పడిగాపులు కాసేవాళ్లం. పురుగు, పుట్ర భయంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని చేనుకాడనే పండుకునేటోళ్లం. ఎంతో మంది రైతులు పాములు కుట్టి, విద్యుత్ షాక్‌తో చనిపోయా రు. ఆ రోజులు ఇంక కండ్లలో మెదులుతున్నయ్. గసొంటి రోజులు మళ్లీ మనకు అవసరమా..? కష్టాలు కావాలని రైతులు ఎందుకు కోరుకుంటారు? ఇప్పుడు 24గంటలు ఎప్పుడంటే అప్పుడు రంది లేకుంట ఉంటాంది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంకనే రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకొని నాలుగు పైసలు సంపాదించు కుంటున్నారు. మళ్లీ కాంగ్రెస్‌కు ఓటేసి కష్టాలు కొని తెచ్చుకుంట రా? అస్సలు తెచ్చుకోరు.. రైతుల మేలు కోరే బీఆర్ఎస్‌కే అన్నదాతల మద్దతు.

**- బానోత్ శ్రీను, రైతు, చోక్లతండా**

## కరంట్ కష్టాలు పోయి చాన్నాళ్లయింది

గూడూరు : తెలంగాణ వచ్చినప్పడి నుంచి కరెంటు కష్టాలు పోయి హాయిగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబమంతా సంతోషంగా ఉన్నాం. మళ్లీ కాంగ్రెసోళ్లు 3గంటల కరెంట్ అంటే నా వ్యవసాయంలో నష్టాలు వచ్చి కుటుంబంలో గొడవలు జరుగుతాయని భయమేస్తున్నది. 3గంటల కరంట్‌తో పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టి సంసారాలను ఆగం చేస్తారా ఏంది. సుఖంగా ఉన్న మేము కష్టాలపాలు అయ్యేందుకు ఇష్టపడుతామా? ఎవరో ఏదో చెప్పింఁడ్రని మేము ఆగం కాము. మా బతుకులు మార్చిన ప్రభుత్వానికి, కేసీఆర్‌కు అండగా ఉంటం. కరంట్ మంచిగా ఇచ్చి పంటలు బాగ పండేందుకు రైతు బంధు అందించి, మా ఊళ్లోనే కాంటాలు పెట్టి ధాన్యం కొంటున్న సర్కారుకే మా మద్దతు. ఇలాంటి సర్కార్ దేశంలో ఎక్కడా లేదు. మళ్లీ గులాబీ సర్కార్‌కే మా మద్దతు. 10 హెచ్‌పీ మోటర్‌తో బావుల్లో నీల్లు ఉంటయా? 3గంటల కరెంట్ ఒకసారే ఇస్తే ఇన్ని మోటర్లు ఆన్‌చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవా? కాంగ్రెసోడికి కనీసం ఆలోచన ఉందా?

**- కోరే దేవేందర్, రైతు, గాజులగట్టు**






## మేం.. నీళ్లు, కరంటు ఇచ్చిన బీఆర్ఎస్ దిక్కే



కురవి : మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రైతుకు మంచిగుంటది. ఐదు దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతును పట్టించుకోలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ 24గంటల కరెంటు, పుష్కలంగా సాగునీరు ఇస్తూ మంచి సౌలత్ చేశిండు. రైతులు గుండెధైర్యంతో ఉన్నరు. ఇప్పుడు కాంగ్రెసోళ్లు వచ్చి మంచిగున్న వ్యవసాయాన్ని చెడగొట్టేందుకు వస్తున్నరు. రైతాంగాన్ని ఆగం చేయాలని చూస్తున్నరు. తెలంగాణ వస్తే కరెంటు కటకట తప్పదని చెప్పింది కాంగ్రెస్సే. వారి అంచనాలను తారుమారు చేసిన కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. మూడు గంటల కరెంటు ఎట్ల సరిపోతది. వలసలు తగ్గి ప్రశాంతంగా, పచ్చగా ఉన్న పల్లెల్లో విషం చిమ్మాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తాంది. రైతులు, ప్రజలు ఆదమరిచి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ కష్టాలు కొనితెచ్చుకున్నట్లే.

**- దొంగలి నర్సయ్య, రైతు, చింతపల్లి**

